
# ఇంకా తెలవారదేమి?

పాతికేళ్ళ క్రితం నేనెవర్ని? ఇప్పుడు నేనెవర్ని? పాతికేళ్ళ క్రితం నేను ఎలా వున్నానని వూహించు కోవటం ప్రారంభిస్తే నాకు తెలిసిన ఎవరో అమ్మాయి గురించి చెప్పుకోటానికి ప్రయత్నిస్తున్నట్లు వుంటుంది. లేత చామనచాయ మొహం, చిన్న కళ్ళు, పిలకల్లాటి జడ, కొంచెం బొద్దుగా గౌనులు వేసుకోటం మాని పరికిణీలు, జుబ్బాలు వేసుకునే తొమ్మి దేళ్ళ అమ్మాయి గుర్తుకొస్తుంది. మెళ్ళో నల్లపూసలతాడు మంగళ సూత్రాలు ఎగురుతున్నా లెక్క చేయకుండా వీధుల్లోనో, దొడ్లోనో, తోట ల్లోనో తొక్కుడుబిళ్ళ, వుప్పులకుప్ప వయ్యారిభామా, చెమ్మ చెక్కలు, బొమ్మలాటలు, బొమ్మల పెళ్ళిళ్ళు ఆడుకునే అమ్మాయి లీలగా ఎవరో తెలిసిన మొహంలా జ్ఞాపకాని కొస్తుంది. అరుగుల మీద చేరి గచ్చ కాయలు, వామనగుంటలు. చింతపిక్కలు ఆడుకునే రోజులవి. మాగాయి టెంక చీకుతోనో, మామిడికాయ ముక్కలు ఉప్పూ కారం వేసి అద్దుకు తింటూనో చెలికత్తెలతో చేరి ఆడుకుంటూ పాడుకుంటూనో గడి పేసిన బాల్యం అది. నా చదువుమీద మావాళ్ళు అట్టే ఖాతిరీ చూపలేదు. ఆ పని యీ పనిచేసే కర్మయోగమే కాని జ్ఞానయోగం పట్టలేదు, పల్లె టూళ్ళలో ఆడపిల్లను చదువుకు బడికి పంపడం అంటే - చెడ గొట్టడం కిందే లెక్క. మగపిల్లలే అంతంత మాత్రంగా చదువుకునేవారు, పనీ పాటా నేర్పి అత్తెసరు పొయ్యి కెక్కించటం. పొయ్యి వెలిగించటం.

గిన్నెలు చెంబులూ తళతళలాడేలా తోమటం. పీకి పిండెట్టి పెద్దవాళ్ళను చీరలూ నగలూ కొనిపించు కొనటం వరకే ఆడదాని జీవిత లక్ష్యం - ఆ తరువాత పిల్లల్ని పెట్టడం వాళ్ళతో కుటుంబాన్ని యీడ్చుకురావటంవరకే ఫ్రిమేల్సు రోలు. చదువుకోకపోయినా మా ఇళ్ళలో అక్కడా అక్కడా రాణీ రుద్రమదేవులూ, నాయకురాళ్ళూ, మొనగత్తెలూ వుండేవారు. మెజారిటీ ఆడసరుకు పొయ్యిలోంచి పడకగదిలోకీ ఆ పైన పురిటిగదిలోకీ వెళ్ళే వాళ్ళే!



బొగ్గులతో కుంపటిమీద వంట చేసేవాళ్ళని గురించి మీతిమీరి పోతున్నారని షోకు లెక్కువని ఈడ్చి తన్నేవాళ్ళు లేక యిలాంటి బుద్ధులనీ ఆడిపోసుగునేవారు. ఆరోజునుంచి ఈరోజువరకూ బోయినా లయాక అరుగులమీదచేరి ఆడాళ్ళు రోజువారీ వార్తా విశేషాలు చాడీలు కష్టసుఖాలు వింతలూ అన్నీ చెప్పుగుని మళ్ళీ సాయంత్రం తిళ్ళకు మధ్యాహ్నంనుంచీ యత్నాలు సాగించేవారు. కాలవకెళ్ళి నీళ్ళు తెచ్చుకోవటం, నూతిదగ్గర నీళ్ళు తోడుకోవటం, రోజూ వంటిల్లు పేడతో అలకటం, ఇల్లంతా శుక్రవారం అలకటం లేదా అలికించటం. పాడి వుంటే గేదెతో కొంత కాలక్షేపం దాని గొడవానూ — ఇదే ఆడవాళ్ళ జీవితం ఎక్కడికేనా వెళ్దాం పైవూరికంటే మా మదర్ "గేదె వుంది — దీనెన్నల్లాగ?" అని చప్పరించేసేది. ఇల్లు కదిలి కాలు బయట పెట్టడం అంటే బ్రహ్మ ప్రళయమే—

ఎక్కడికి వెళ్ళాలన్నా గేదె, పాడి, వ్యవసాయం, అన్నీ అడ్డే. ఇప్పటి వాళ్ళలాగ తలుపు తాళంవేసేసి టింగు రంగామని ప్రయాణం కావటానికి వీలేది? మనం ఊళ్ళో లేకపోతే కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు కోసేస్తారు. మట్టామడక కంజా, తోటల్లో కూరా నారా అంతా దొంగిలిస్తారు. పైగా గేదె-ఎవరన్నా ముసలమ్మ వచ్చి దయతో వుంటానికి అంగీకరిస్తే, ఇంకెవరైనా చుట్టాన్ని ఇంట్లోపెట్టి బయల్దేరాల్సిందే - మాది తూగోజీ పగోజీ కాపటం వలన బస్సులు, పడవలు, ఒల్లకట్టులు, ఒంటెద్దుబళ్ళు, జట్కాలు తప్ప పెళ్ళయ్యేదాకా నేను రైలుబండి ఎక్కలేదంటే నమ్మండి. అయితే రైలెక్కడం అప్పటి సెకండ్ క్లాస్ అంటే యిప్పటి ఫస్ట్‌క్లాస్ మెయిల్లో వైజాగ్ వెళ్ళాం-ఆ రోజు ప్రయాణం నాకు అపోలో చంద్ర మండల యాత్రకంటే ఎక్కువ థ్రిల్ కలిగించింది. రైల్లో మేం మినప సున్ని వుండలు, అరిసెలు, పులిహోరా తింటూంటే ఆ పెట్టెలోని మిగతా హైక్లాసు ప్యాసింజర్లు మమ్మల్ని జంతువుల్ని చూసినట్లు చూశారు. అయితే ఎన్ని ఇన్సల్ట్లయినా ఒక్క మినప సున్నివుండ ముందు బలాదూర్!

పాతికేళ్ళనాడు ఈ మన దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం ఒక అర్థ రాత్రపు వింత. మేమంతా చాపమీదా మంచాలమీదా పడి నిద్దర్లోవుండగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు తెల్లారి లేచేసరికి. నేను గ్రామ ఫోను చూసింది కూడా స్వరాజ్యం వచ్చేకే - అప్పుడు రేడియో వినాలంటే వైజాగ్‌లో ఎవరింటికేనా వెళ్ళాలిసొచ్చేది. అఫ్‌కోర్సు బళ్ళు కట్టుకుని వెళ్ళి పాలకొల్లు, పెనుగొండ, నరసాపురం, తణుకు, సినిమాలు చూసే వారం అనుకోండి. యుద్ధం అయిపోగానే బట్టల కరువు, పెద్ద పట్టణాలలో తిండి గింజల కరువు ఆరంభమయింది. వైజాగ్‌లో రేషనుబియ్యం, గోధు మల్నూ వాడమని గాంధీగారు దక్షిణాదివారికి చెప్పారు. అప్పుడే మావయ్య గారు స్టాండర్డు క్లాత్ (కోరాగుడ్డ కొనుక్కొచ్చి ఇంట్లో దుప్పట్ల దగ్గ ర్నుంచీ షర్టులూ తువాళ్ళకూ లాగులకూ అదే వాడటం మొదలెట్టారు. మిల్లు బట్ట నాజూకు వస్త్రాలు క్యూల్లో నిలబడి కొనుక్కోవాల్సి వచ్చేది. అయితే నేత చీరలు నేత బట్టలు మాత్రం విరివిగా దొరికేవి. యుద్ధంతో

ప్రారంభమయిన బ్లాక్ మార్కెట్ దొంగవ్యాపారం స్వాతంత్ర్యం వచ్చినా లెక్కలేనట్టుగా సాగుతూ వుండేది. యుద్ధం తర్వాత స్వరాజ్యం రావటంతో గవర్నమెంటు ఉద్యోగుల కంటె ప్రయివేటు వ్యాపారాలవాళ్ళు పొలాలు పుట్రలూ వున్న వాళ్ళపని మెరుగవసాగింది. కూలీ నాలీ అలగా జనం. మధ్యతరగతి కట కటలాడటం డబ్బు విలువ పడిపోవటం 1947 నుంచే ఎక్కువయింది. మనకు వచ్చిన స్వాతంత్ర్యం కష్టాలతో ప్రారంభమయింది. దేశ విభజన జరగటం ఎవరికీ యిష్టంలేదు. బెంగాల్‌లోనూ, పంజాబులోనూ జరిగిన హిందూ ముస్లిం కలహాలు కొట్లాటలు "పాకిస్తాన్" ఏర్పడటం ఈ దుఃఖ సముద్రంలో ప్రజలు మనదేశ స్వాతంత్ర్యం వచ్చిన పండుగ ఉత్సాహం కనబర్చలేకపోయారు. కాందిశీకుల సమస్యతో ప్రారంభమయిన మన కష్టాలు ఇంతవరకూ తెల్లారనేలేదు.